
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
ఆదివారం 22 సెప్టెంబరు 2024



## జిల్లాలో నేడు, రేపు భారీ వర్షాలు

**చింతపల్లి, సెప్టెంబరు 21:** అల్లూరి జిల్లా వ్యాప్తంగా ఆది, సోమ వారాలు భారీ వర్షాలు పడే అవకాశమున్నదని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శనివారం ప్రత్యేక వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. రెండు రోజులు భారీగా వర్షపాతం నమోదయ్యే అవకాశమున్నదన్నారు. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో పిడుగులు పడే అవకాశం ఉన్నదన్నారు. కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయన్నారు.

# ముందస్తు రబీ పంటగా వలిసెలు

**నాట్లుకు ఇదే అదను**

- నూనె గింజలకు మార్కెట్‌లో డిమాండ్
- తొలిసారిగా నూతన వంగడాలు సాగు



వలిసెల పంట (ఫైల్)



ఉత్కల్ నైజర్-150 వలిసెల విత్తనం

**చింతపల్లి, సెప్టెంబరు 21:** జిల్లాలో ముందస్తు రబీ పంటగా వలిసెల సాగుకు రైతులు సన్నద్ధం కావాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నాట్లుకి ఇదే అదను అని, రైతులు పొలాలను సిద్ధం చేసుకోవాలని సూచిస్తున్నారు. పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గతంలో 16వేల హెక్టార్లలో వలిసెలను రైతులు సాగుచేసేవారు. ఆకాశ పంది కలుపు ఉధృతి, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో సాగు విస్తీర్ణం పడిపోయింది. దీంతో ప్రస్తుతం పాడేరు డివిజన్‌లో ఐదు వేల హెక్టార్లలో మాత్రమే వలిసెలను సాగు చేస్తున్నారు. అధిక నూనె శాతం కలిగిన వలిసెల పంట మన్యం ప్రకృతి అందాలకు మరింత శోభను తీసుకొస్తుంది. వలిసెల నూనెను వంట నూనెగా, రుచికరమైన ఆహార పదార్థాల తయారీ, పరిశ్రమల్లో రంగులు, సబ్బుల తయారీలో ఉపయోగిస్తారు. ఈ కారణంగాన వలిసెలకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తోంది.

### వాతావరణం, విత్తే సమయం

వలిసెల సాగుకు సంవత్సర సరాసరి వర్షపాతం 100 సెంటీమీటర్లు అవసరం. సాగు చేసేందుకు 18-23 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత అనుకూలం. గిరిజన ప్రాంత వాతావరణం, నేలలు సాగుకు అత్యంత అనుకూలం. సెప్టెంబరు రెండో పక్షం నుంచి అక్టోబరు మొదటి వారం వరకూ వలిసెల నాట్లు వేసుకోవడానికి అనుకూలం.

### అనుకూలమైన రకాలు, దిగుబడి

కేజీఎన్-2 రకం విలిసెలు 50 రోజుల్లో పూతకు వస్తోంది. 190 సెంటీమీటర్లు ఎత్తు పెరుగుతోంది. 100 నుంచి 110 రోజులకు పంట కోతకు వస్తోంది. హెక్టారుకు 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. ఉత్కల్ నైజర్-150 ఎకరాకు 4 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. జేఎన్ఎస్-28, జేఎన్ఎస్-30 ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.

### విత్తన మోతాదు

ఎకరాకు 4 కిలోలు విత్తనం అవసరం. సాధారణంగా గిరిజన రైతులు వెదజల్లి చెట్టు కొమ్మను నేలపైలాగి విత్తనాన్ని నేలలో కలయబెడతారు. ఈ పద్ధతి సరైంది కాదు. వరుసల మధ్యలో 30 సెంటీమీటర్లు దూరం పాటిస్తూ విత్తుకుంటే అధిక దిగుబడి వస్తోంది.

### అంతరకృషి

వలిసెల సాగులో అంతర కృషి అత్యంత కీలకం. వలిసెలు విత్తన 15రోజుల తరువాత 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు కలుపు తీసుకోవాలి. ప్రధానంగా ఆకాశ పందిరి అనే సంపూర్ణ కాండ పరాన్నజీవి నాటిన నెల రోజుల్లో ఈ పంటను ఆశించి అధిక నష్టం కలిగిస్తుంది. ఇది నేలలో పడిన విత్తనం ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుంది. అకాశపందిరి కలుపు మొక్క కాండ పరాన్నజీవిగా వలిసెల పంటకు ఆశించి నష్టపరుస్తుంది. ఈ మొక్కకు ఆకులుగాని, క్లోరోఫిలర్ గాని లేకపోవడం వల్ల సొంతంగా ఆహారం సమకూర్చుకోలేదు. వలిసెల మొక్కపై హస్టోరియా అనే భాగాలతో అతుక్కొని అతిథి మొక్క(వలిసెలు) నుంచి కార్బోహైడ్రేట్స్‌ను గ్రహిస్తుంది. దీనివల్ల వలిసెల దిగుబడి, నాణ్యత, మొక్కల సాంద్రత తగ్గిపోతుంది. విత్తనాలు నేలలో వుంటూ 20 సంవత్సరాలు మొలకెత్తే సామర్థ్యం కలిగి వుంటాయి.

### బంగారు తీగ నివారణ

బంగారు తీగ కలుపు నివారణకు వలిసెల విత్తనాలను జల్లెడతో (0.85-1.00ఎంఎం) జల్లించి ఆకాశపందిరి విత్తనాలను వేరు చేసుకోవాలి. లేకుంటే ... మిగతా 8వ పేజీలో

### రైతులతో నూతన వంగడాలు సాగు



విత్తనోత్పత్తి లక్ష్యంగా ఉత్కల్ నైజర్-150 నూతన వంగడాలను తొలిసారిగా గిరిజన రైతులతో సాగు చేయిస్తున్నాం. జి.మాడుగుల మండలంలోని వెన్నెలకోట, దేవరాపల్లి, కృష్ణాపురం రైతులకు గిరిజన ఉప ప్రణాళిక, ఎఫ్ఎల్‌డీ పథకంలో భాగంగా విత్తనం, ఎరువులు ఉచితంగా అందజేసి 75 మంది రైతులతో 75 ఎకరాల్లో సాగు చేయిస్తున్నాం. నాట్లు వేసిన నాటి నుంచి పంట కోసే వరకు సాంకేతిక సహకారం అందిస్తాం. ఎకరాకు 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. వచ్చే ఏడాది ఏజెన్సీ వ్యాప్తంగా రైతులకు ఈ వంగడం చిరు సంచుల్లో అందజేస్తాం. ఈ రైతు క్షేత్రాల్లో ఇతర రైతులకు సాగు విధానంపై శిక్షణ ఇస్తాం.

**డాక్టర్ వాన ప్రసాదరావు**, సేద్యవిభాగం శాస్త్రవేత్త, కేవీకే, హరిపురం

# ప్రజల ఆకాంక్షల మేరకే కూటమి పాలన

**ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ చిరంజీవిరావు**

- జి.మాడుగుల మండలం వంతలలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం




జి.మాడుగుల మండలం వంతల గ్రామంలో కూటమి నేతల ర్యాలీ

**పాడేరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** ప్రజల ఆకాంక్షల మేరకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని, ఫలితంగా అన్ని వర్గాల వారు సంతృప్తితో ఉన్నారని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ చిరంజీవిరావు అన్నారు. జి.మాడుగుల మండలం వంతలలో టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రజా వ్యతిరేక పాలన చూసిన ప్రజలు కూటమి పాలనతో ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. కేవలం వంద రోజుల్లోనే పెన్షన్ల పెంపు, ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు, రాష్ట్రంలో శాంతి భద్రతలను అదుపులో ఉంచడం, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, అమరావతి, పోలవరానికి జీవం పోయడం వంటి అనేక కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. విజయవాడలో సంభవించిన వరదల్లో కూటమి ప్రభుత్వం చేసిన ... మిగతా 8వ పేజీలో

## ఇది మంచి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం

**జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్**

**హుకుంపేట, సెప్టెంబరు 21:** 'ఇది మంచి ప్రభుత్వం' తోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని తాడిగిరిలో నూతనంగా నిర్మించిన రచ్చబండను ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో అధికారులు, ప్రజలతో మానవహారంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టు పాడైందని, దానిని మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరారు. అలాగే వేసిన ఆరు నెలలకే తారు రోడ్డు మరమ్మతులకు గురైందని, కామయ్యపేట రోడ్డు కూడా సరైన నాణ్యత లేదని ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి బాగు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ దినేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మరో ఆరు రోజులు నిర్వహిస్తామని, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామ న్నారు. రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత నిర్ధారణలో నిర్లక్ష్యం చేసిన క్వాలిటీ కంట్రోల్ ఆధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టి, ప్రజలు ఆరోగ్యంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెలా మూడో వారంలో పరిశుభ్రత కార్యక్రమాలను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, స్థానిక సర్పంచ్ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తాడిగిరిలో నిర్వహించిన మానవహారంలో ఇది మంచి ప్రభుత్వం బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

## ఏవోబీలో మందుపాతర స్వాధీనం

**గంపకొండ అటవీ ప్రాంతంలో వెలికితీసిన ఒడిశా పోలీసులు**



గంపకొండ అటవీ ప్రాంతంలో బీఎస్ఎఫ్ బలగాలు వెలికి తీసిన మందుపాతర

**సీలేరు, సెప్టెంబరు 21:** ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని గంపకొండ అటవీ ప్రాంతంలో పోలీసులనే లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు అమర్చిన మందుపాతరను శనివారం ఒడిశా పోలీసులు వెలికి తీశారు. వివరాలిలా ఉన్నాయి.

ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలో బోడిగెట్టకు చెందిన బీఎస్ఎఫ్ బలగాలు మావోయిస్టుల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గంపకొండ అటవీప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గంపకొండ కెనాల్ వంతెన వద్ద మావోయిస్టులు అమర్చిన మందుపాతరను పోలీసు బలగాలు గుర్తించాయి. దీంతో మందుపాతరను నిర్వీర్యం చేసిన అనంతరం, డిటోనేటర్, 30 మీటర్ల వైర్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఒడిశా పోలీసులు తెలిపారు. ఏవోబీలో మావోయిస్టులు ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

## కొలిక్కి వచ్చిన రెవెన్యూ బదిలీలు?

- నేడు జాబితా విడుదల చేసే అవకాశం
- మిగిలిన శాఖల్లోనూ...

**విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ శాఖల్లో బదిలీలకు ఆదివారంతో గడువు ముగియనున్నది. గడువు మరోసారి పొడిగిస్తారన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ శాఖాపరంగా బదిలీలకు కసరత్తు ముగిసినట్టు చెబుతున్నారు. బహుశా ఆదివారం బదిలీ ఉత్తర్వులు వెలువడవచ్చునంటున్నారు. ఏట్టి పరిస్థితుల్లో ఆదివారం బదిలీ ఉత్తర్వులు రావాలని, లేకపోతే అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో తహసీల్దార్ల పరిస్థితి మరింత ఇబ్బందిగా మారే అవకాశం ఉందంటున్నారు. అనకాపల్లి జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్‌లో తహసీల్దార్లకు పోస్టింగ్స్‌పై జూలై నుంచి అనిశ్చితి కొనసాగుతోంది. ఎన్నికల నేపథ్యంలో ఉత్తరాంధ్రలో మిగిలిన రెండు ఉమ్మడి జిల్లాలకు వెళ్లి జూలైలో వెనక్కి వచ్చిన తహసీల్దార్లకు గతంలో పనిచేసిన మండలం కాకుండా మరోచోట పోస్టింగ్ ఇవ్వాలి. కానీ ఇంతవరకూ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో బదిలీలు పూర్తిచేయాలని నిర్ణయించుకున్న మూడు జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే సమావేశమై చర్చించుకున్నారు. ఎవరిని ఏజెన్సీకి పంపాలి?, ఎవరిని కొండపైనుంచి మైదానానికి తీసుకురావాలనే జాబితా రూపొందించుకున్నారని తెలిసింది. శనివారం బదిలీ చేస్తే రాజకీయ నాయకుల నుంచి ఒత్తిడి తెచ్చే అవకాశం ఉన్నందున ఆదివారం సాయంత్రంలోగా జాబితా వెలువరిస్తే సరిపోతుందని అంచనాకు వచ్చారంటున్నారు. కాగా జిల్లా పరిషత్, జల వనరులు, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్, ఇతర శాఖల్లో బదిలీలకు సంబంధించి కూడా కసరత్తు పూర్తయ్యింది. ఆయా శాఖల అధికారులు జాబితాలకు కలెక్టర్ ఆమోదం తీసుకునే పనిలో ఉన్నారు. వాటిని కూడా ఆదివారం విడుదల చేసే అవకాశం ఉంది.

# స్వీట్స్‌లోనూ కల్తీ నెయ్యే?

**స్వచ్ఛమైన నేతితో తయారు చేసినవంటూ మోసం చేస్తున్న కొంతమంది దుకాణదారులు**

- డాల్డా, పామాయిల్, తదితరాలు మిక్సింగ్
- కలర్ కోసం రంగులు..
- పట్టని ఫుడ్ సేఫ్టీ అధికారులు
- కాస్త నాణ్యమైన నెయ్యి కొనాలంటే కిలోకు రూ.800 నుంచి రూ.1,600 పెట్టాల్సిందే



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'నేతి బీరకాయ' చందంలాగే నేతి మిఠాయిలు తయారవుతున్నాయి. 'స్వచ్ఛమైన నేతితో తయారైన స్వీట్లు' అంటూ భారీ బోర్డులు పెట్టి పెద్దఎత్తున విక్రయాలు చేస్తున్న సంస్థలు అడ్డగోలుగా మోసాలకు పాల్పడుతున్నాయి. విశాఖలో వీధికి రెండు స్వీటు దుకాణాలు వెలిశాయి. 'వేడి వేడి నేతి బొబ్బట్లు' అంటూ అక్కడే పెనం పెట్టి, దానిపై బొబ్బట్లు అటు ఇటు తిప్పుతూ... గరిటెతో నెయ్యి పోసి వేడి వేడివి ప్యాకింగ్ చేసి ఇస్తున్నాయి. కిలోకు కేవలం రూ.230 నుంచి రూ.260 తీసుకుంటున్నాయి. కొనుగోలుదారులకు కనీసం అది నిజంగా నెయ్యేనా?, అనే అనుమానమే రావడం లేదు. అలాగే నెయ్యితో తయారుచేసిన లడ్డూలంటూ అదనంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. కనీసం ముక్కుకు నెయ్యి వాసన కూడా రాదు.

### కిలో నెయ్యి రూ.600కి తక్కువ లేదు

నగరంలో కిలో నెయ్యి ఎవరూ రూ.600 కంటే తక్కువకు ఇవ్వడం లేదు. విశాఖ డెయిరీ కిలో రూ.660 చొప్పున అమ్ముతోంది. అదే ఆవులను పెంచుతూ పాల వ్యాపారం చేసేవారైతే కిలో రూ.800పైనే అమ్ముతున్నారు. ఆర్గానిక్ వ్యవసాయం చేసేవారైతే దేశీ ఆవు నెయ్యి రూ.1,600, గిరి ఆవుల నెయ్యి కిలో రూ.2,500 చొప్పున విక్రయిస్తున్నారు. స్వచ్ఛమైన నెయ్యి కిలో తయారు చేయాలంటే కనీసం 15 లీటర్ల పాలు అవసరం. రైతుల నుంచి కొనే పాలు లీటరు రూ.40 వేసుకున్నా (విశాఖ డెయిరీవి రూ.60పైనే) పాలకే రూ.600 వ్యయం అవుతుంది. వాటిని వేడి చేయడానికి, గంటల తరబడి ప్రాసెస్ చేయడానికి ఇంకో రూ.150 ఖర్చు అవుతుంది. అంటే సాధారణ పాలతో కిలో నెయ్యి తయారీకి రూ.750 వ్యయం అవుతుంది. రూ.50 లాభం వేసుకొని కిలో రూ.800కి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ నెయ్యిని చెంచాతో తీసి ముక్కు దగ్గర పెట్టుకుంటే చక్కటి సువాసన వస్తుంది. అయితే రోజూ డబ్బాల కొద్దీ (డబ్బాకి 15 కిలోలు) నెయ్యి వాడే స్వీటు షాపుల వారు కాంట్రాక్టర్ల నుంచి కిలో రూ.400 కంటే తక్కువకే కొంటున్నారు. అంత తక్కువ రేటుకు నాణ్యమైన నెయ్యి రానే రాదు. ఆ విషయం దుకాణాల యజమానులకూ తెలుసు. అయినా కొంటున్నారు. సరఫరాదారులు కొందరు నెయ్యిలో డాల్డా కలుపుతుంటే, మరికొందరు ఆవు, పంది కొవ్వులు కలిపి నెయ్యి సరఫరా చేస్తున్నారు. స్వీటు షాపుల వారికి వ్యాపారమే ప్రధానం కాబట్టి ఇవన్నీ పట్టించుకోవడం లేదు. నగరంలోని కొన్ని స్వీటు షాపులకే ఐఎస్ఓ సర్టిఫికేషన్‌లు ఉన్నాయి. మిగిలిన వారికి వాటి గురించి అవగాహనే లేదు.

### గడువు తేదీ గాలికి...

ప్యాకింగ్ చేసే ప్రతి ఆహార పదార్థానికి విక్రేతలు గడువు తేదీ వేయాలి. ఆ నిబంధనను స్వీటు షాపులు కూడా పాటించాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. కొన్నాళ్లు పెద్ద పెద్ద స్వీటు షాపుల వారు ఈ నిబంధన పాటించారు. ఆ తరువాత గాలికి వదిలేశారు. ఇప్పుడు ఏ షాపులోను ఈ బోర్డులు కనిపించడం లేదు. వాస్తవానికి స్వచ్ఛమైన నెయ్యితో తయారైన స్వీట్లు మెత్తగా ఉండి ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. కల్తీ నెయ్యితో తయారుచేసినవి ఒక్కరోజులోనే ఎండిపోయి రుచిని కోల్పోతాయి. నగరంలో ... మిగతా 8వ పేజీలో

## అనారోగ్యంతో విద్యార్థిని మృతి

**రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న బాలిక**

- అనంతగిరి పీహెచ్‌సీలో వైద్య సేవలు
- మెరుగైన వైద్యం కోసం ఎస్.కోట తరలిస్తుండగా మృతి

**అనంతగిరి, సెప్టెంబరు 21:** మండలంలోని టోకూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలోని చదువుతున్న సూకురు అప్పలకొండ (13) అనే విద్యార్థిని జ్వరంతో శుక్రవారం రాత్రి మృతిచెందింది. రెండు రోజుల క్రితం బాలికకు జ్వరంతో రావడంతో అనంతగిరి పీహెచ్‌సీకి తరలించి, వైద్యసేవలను అందించారు. శుక్రవారం రాత్రి బాలిక ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో మళ్లీ అనంతగిరి పీహెచ్‌సీ తీసుకువెళ్లి వైద్యసేవలు అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలోని బాలిక అప్పలకొండ మృతిచెందింది.



మృతిచెందిన విద్యార్థిని సుకూరు అప్పలకొండ

మృతదేహానికి సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ కరక రాము తెలిపారు. బాలిక కుటుంబ సభ్యులను ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ కలిసి ఓదార్చారు. అనంతగిరి పరిధిలోని మృతిచెందిన మృతదేహాలకు ఎస్.కోట సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించేందుకు వైద్య సిబ్బంది అంగీకరించకపోవడంపై ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి మండిపడ్డారు.

# గిరిజన ఉత్పత్తుల కోసం వన్‌దన్ హబ్‌లు

- అధికారుల సమావేశంలో ఐటీడీఏ పీవో అభిషేక్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్, పక్కన డీఆర్‌డీఏ పీడీ వి.మురళి

**పాడేరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** గిరిజన ఉత్పత్తుల కోసం వన్‌దన్ హబ్‌లను ఏర్పాటు చేస్తామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. డీఆర్ డీఏ, వెలుగు ఏపీఎంలతో ప్రధాన మంత్రి వన్‌దన్ వికాస కేంద్రాలపై శనివారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో వీడీవీకేల బలోపేతానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే మూడు లేదా నాలుగు వన్‌దన్ వికాస కేంద్రాలను అనుసంధానం చేస్తూ వీడీవీకే హబ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. ఐటీడీఏ పరిధిలో 106 వీడీవీకేలు, 8 ప్రత్యేకంగా పీవీటీజీల వీడీవీకేలున్నాయన్నారు. వాటిలో ఎన్నింటికి భవనాలున్నాయని, సమకూర్చిన యంత్ర పరికరాలు, సభ్యులకు ఇచ్చిన శిక్షణలపై ఆరా తీశారు. అలాగే శిక్షణ పూర్తి చేసిన వీడీవీకేలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వీడీవీకేల్లో సేకరిస్తున్న అడ్డాకులు, చింతపండు, చీపుర్లు, మిల్లెట్ బిస్కెట్ల తయారీకి వీడీవీకేల ద్వారా సేకరిస్తున్న ముడి సరుకులను హబ్‌లకు సరఫరా చేయాలని పీవో అభిషేక్ సూచించారు. అలాగే వీడీవీకేల నిర్వహణకు అవసరమైన యంత్ర పరికరాలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. గిరిజన ఉత్పత్తుల సేకరణ కేంద్రాల్లో ఇద్దరు సమన్వయకర్తలను నియమించి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అడ్డాకులతో ప్లేట్లు, కప్పుల తయారీ చేయాలన్నారు. అన్ని హబ్‌ల్లో వచ్చే నెలాఖరు నాటికి ఉత్పత్తులు ప్రారంభించాలన్నారు. ఐటీడీఏల్లో నిర్వహించే సమావేశాల్లో వీడీవీకేల ఉత్పత్తులను వినియోగించాలని పీవో అభిషేక్ సూచించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవోలు వీఎస్‌ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, 11 మండలాల వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్లు, ఏపీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రైం... crime news

## ద్విచక్ర వాహనం, సైకిల్ ఢీ

▸ ఇద్దరికి తీవ్ర గాయాలు

**ముంచంగిపుట్టు, సెప్టెంబరు 21:** దారెల పంచాయతీ పరిధిలోని వరం డాపుట్టు గ్రామ సమీపంలో మలుపువద్ద ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం, సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సుజన కోట పం చాయతీ గొడుగులపుట్టు గ్రామానికి చెందిన బి.మోహన్‌పాత్రో ముంచంగిపుట్టులో శనివారం జరిగిన వారపు సంతకు సైకిల్‌పై వచ్చి ఇంటికి తిరిగి పయమయ్యాడు. అదే సమయంలో అదే పంచాయతీ వనుగుపుట్టు గ్రామానికి చెందిన వి.మనోజ్, ఏనుగురాయి పంచాయతీ బొండాపుట్టు గ్రామానికి చెందిన కె.ఉదయ్ ద్విచక్ర వాహనంపై ముంచంగిపుట్టు వస్తున్నారు. మార్గమధ్యంలోని వరండాపుట్టు మలుపు వద్ద వీరు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నారు. దీంతో సైకిలిస్టు మోహన్‌పాత్రో, బైక్‌పై ఉన్న ఉదయ్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సీహెచ్‌సీలో చేర్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ గీతాంజలి, వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య సేవల కోసం అల్లూరి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

### ఆటో అదుపు తప్పి నలుగురు విద్యార్థులకు గాయాలు

**కశింకోట, సెప్టెంబరు 21 :** మండలంలోని వెదురుపర్తి మీదుగా కశింకోటకు పాఠశాల విద్యార్థులతో వస్తున్న ఆటో అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 20 మంది విద్యార్థుల్లో ఒక విద్యార్థినికి తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకొని మిగిలిన విద్యార్థులను ఇళ్లకు తీసుకు వెళ్లిపోయారు. కాగా తీవ్రంగా గాయపడిన కుక్కల రామచంద్రిక, మరో ముగ్గురు విద్యార్థులను అనకాపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రామచంద్రిక ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, మిగిలిన ముగ్గుర్ని ఇంటికి పంపినట్టు గ్రామస్థులు తెలిపారు.

### ఇటలీ పర్యాటకులకు తప్పిన ప్రాణాపాయం

**మల్కాపురం/సింధియా, సెప్టెంబరు 21:** విశాఖ నగర శివారునున్న యారాడ వద్ద సముద్ర స్నానానికి దిగి ప్రాణాపాయ స్థితిలో చిక్కుకున్న విదేశీ పర్యాటకులను లైఫ్‌గార్డులు రక్షించారు. ఇటలీ దేశానికి చెందిన దాదాపు పది మంది శనివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో యారాడ తీరం సందర్శనకు వచ్చారు. వీరిలో ఐదుగురు స్నానానికి దిగారు. ఒక్కసారిగా వచ్చిన కెరటానికి స్నానం చేస్తున్న ఐదుగురిలో నలుగురు కొంతదూరం కొట్టుకుపోయారు. ఒకరు బయటకు ఈదుకుంటూ వచ్చారు. కెరటాల్లో చిక్కుకున్న మిగిలిన నలుగురు కేకలు వేయడంతో లైఫ్‌గార్డులు (గజ ఈతగాళ్లు), మెరైన్ పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే లైఫ్ గార్డులు సముద్రంలోకి వెళ్లి నలుగురు విదేశీయులను కాపాడారు. తమ ప్రాణాలను కాపాడిన స్విమ్మర్లు కె.వెంకటేష్, కె.లోవరాజు, సీహెచ్ శ్రీనివాస్ లకు విదేశీయులు కృతజ్ఞతలు తెలిపారు. యారాడ తీరంలో ఈతకు దిగరాదని, గతంలో ఇక్కడ అనేక మంది చనిపోయారని అరుణేశ్వరరావు (పీసీ), సీహెచ్ అప్పారావు (హెచ్‌జీ) ఈ సందర్భంగా హెచ్చరించారు. విదేశీయులను ముందుగా హెచ్చరించినా భాష సమస్యతో వారు వినిపించుకోకుండా ముందుకువెళ్లారన్నారు.

## 'లారస్'ను సందర్శించిన వెంకయ్యనాయుడు



ఔషధాల తయారీపై వెంకయ్యనాయుడుకు వివరిస్తున్న సంస్థ ప్రతినిధులు

**పరవాడ, సెప్టెంబరు 21:** ఇక్కడి ఫార్మాసిటీలో గల లారస్ ల్యాబ్స్ యూనిట్-1 పరిశ్రమను భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు శనివారం సందర్శించారు. తొలుత ఆయనకు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సి.లక్ష్మణరావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (హెచ్‌ఆర్) చావా నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (ఆపరేషన్ ) ఎస్ఎస్ రావు ఘన స్వాగతం పలికారు. పరిశ్రమలోని అన్ని విభాగాల గురించి వెంకయ్యనాయుడుకు వివరించారు. ఔషధాల తయారీతో పాటు ఫార్మాసూటికల్ రంగంలో లారస్ ల్యాబ్స్ పోషిస్తున్న పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (హెచ్‌ఆర్) బోడేపూడి రామకృష్ణ, సీనియర్ జనరల్ మేనేజర్ సునీతాదంతా పాల్గొన్నారు.

## నేడు ఆలస్యంగా బయలుదేరనున్న రైళ్లు

**విశాఖపట్నం, సెప్టెంబరు 21:** ఖరగ్‌పూర్ డివిజన్‌లో నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో హౌరా, షాలిమార్, సంత్రాగచ్చి స్టేషన్ల నుంచి ఆదివారం (22న) బయలుదేరే పలు రైళ్లను రీ షెడ్యూల్ చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో ఆదివారం (22న) హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703) నాలుగు గంటలు ఆలస్యంగా, హౌరా-బెంగళూరు దురంతో (12245), షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045) లు గంట ఆలస్యంగా, సంత్రాగచ్చి-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ (07222) అరగంట ఆలస్యంగా బయలుదేరుతాయని పేర్కొన్నారు.

## పాల్మన్‌పేట సర్పంచ్ మూడు నెలలు సస్పెండ్

▸ అధికార దుర్వినియోగం నిర్ధారణ కావడంతో డీపీవో చర్యలు

**పాయకరావుపేట, సెప్టెంబరు 21 :** మండలంలోని పాల్మన్‌పేట సర్పంచ్ కోడ కోటేశ్వరరావును మూడు నెలల పాటు సర్పంచ్ పదవి నుంచి సస్పెండ్ డీపీవో ఆర్.శిరీషారాణి ఉత్తర్వులు జారీచేశారు. సర్పంచ్ కోటేశ్వరరావు సాల్వేషన్ సర్టిఫికెట్లు జారీచేసి అధికార దుర్వినియోగం చేశారని ఆదే గ్రామానికి చెందిన ఎం.అశోకచక్రవర్తి అనే వ్యక్తి 2021లో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. దీనిపై చేపట్టిన విచారణలో కోటేశ్వరరావు అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు రుజువు కావడంతో పాటు హై కోర్టు కూడా నిర్ధారించడంతో ఆయనను సర్పంచ్ పదవి నుంచి మూడు నెలలపాటు సస్పెండ్ చేస్తూ డీపీవో ఆదేశాలు జారీచేశారని పంచాయతీ అధికారుల ద్వారా తెలిసింది

## 'సీతారాం ఏచూరి సేవలు చిరస్మరణీయం'



సంతాపసభలో మాట్లాడుతూ అజశర్మ


**అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 21 :** దివంగత నేత సీతారాం ఏచూరి సేవలు చిరస్మరణీయమని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం అనకాపల్లిలో సీతారాం ఏచూరి సంతాప సభ ఏర్పాటైంది. ముందుగా ఆయన చిత్రపటానికి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతతత్వం, కార్పొరేట్ శక్తుల కలయికపై సైద్ధాంతికంగా పోరాడిన యోధుడు సీతారాం ఏచూరి అని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ ప్రజల తరపున నిక్కచ్చిగా పోరాడిన వ్యక్తి ఏచూరిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ఎస్ నారాయణ, గంటా శ్రీరామ్, పెంటకోట శ్రీనివాసరావు, కె.తేలయ్యబాబు, ఆర్.రమేష్, రమణాజీ, వీవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | రూ.లలో |
| రైతు ధర | 95.00 |
| లైవ్ ధర | 115.00 |
| విత్ స్కిన్ | 200.00 |
| స్కిన్ లెస్ | 210.00 |

| కోడి గుడ్లు (నెక్) | |
|---|---|
| వంద గుడ్లు | రూ.లలో |
| విశాఖపట్నం | 555 |
| విజయనగరం | 559 |
| శ్రీకాకుళం | 559 |

# భయంతోనే ప్రాణాల మీదకు...

### ఉత్తరాంధ్రలో కేన్సర్ కేసుల గుర్తింపులో తీవ్ర జాప్యం



▸ మూడు, నాలుగు స్టేజ్‌ల్లో ఆస్పత్రులకు వస్తున్న రోగులు

▸ ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడలేకపోతున్న వైద్యులు

▸ భయాన్ని, అపోహలను వీడితే సమస్యకు పరిష్కారం

▸ కేన్సర్ బారినపడినా మెరుగైన వైద్య సేవలతో సాధారణ జీవితం

▸ నేడు వరల్డ్ రోజ్ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

ప్రపంచ వ్యాప్తంగా కేన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. ఏటా లక్షలాది మంది కేన్సర్ మహమ్మారి బారినపడి మృతి చెందుతున్నారు. ప్రపంచానికి సవాల్ విసురుతున్న రోగాల్లో కేన్సర్ రెండో స్థానంలో ఉంది. కేన్సర్ బారినపడ్డామని తెలిసినా, లక్షణాలు ఉన్నట్టు అనుమానం కలిగినా చాలామంది భయాందోళనకు గురవుతుంటారు. కొంతమందికి అనుమానిత లక్షణాలు ఉన్నప్పటికీ వైద్య పరీక్షలు చేయించుకునేందుకు కూడా ఆసక్తి చూపించడం లేదు. ఆ భయమే కేన్సర్ వ్యాధి బాధితులు తక్కువ వ్యవధిలోనే మృతి చెందేందుకు కారణమవుతోంది. కేన్సర్ వ్యాధి కూడా మిగిలిన రోగాల వంటిదేనని, సకాలంలో గుర్తించి చికిత్స తీసుకుంటే సాధారణ జీవితాన్ని గడిపే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. భయం వ్యాధి కంటే ప్రమాదకరమైనదని, ధైర్యం మందు కంటే గొప్పదని వైద్యులు చెబుతున్నారు. కేన్సర్ వ్యాధిని కూడా ధైర్యంతో సమర్థవంతంగా ఎదుర్కొంటే ప్రమాదం నుంచి బయటపడవచ్చని పేర్కొంటున్నారు. కేన్సర్ రోగుల్లో ఉన్న భయాన్ని తొలగించి, వారికి సాంత్వన కలిగించడంతో పాటు బతుకుతావన్న భరోసా ఇవ్వాలనే ఉద్దేశంతో ఏటా సెప్టెంబర్ 22న కేన్సర్ రోగుల సాంత్వన దినోత్సవంగా (రోజ్ డే) నిర్వహిస్తున్నారు. ఆదివారం రోజ్ డేను పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

**ఆ చిన్నారి జ్ఞాపకార్థం..**

అరుదైన కేన్సర్ వ్యాధితో పోరాడుతూ మృతి చెందిన చిన్నారి మిలిందా రోజ్ జ్ఞాపకార్థం రోజ్ డేను 2000వ సంవత్సరం నుంచి నిర్వహిస్తున్నారు. ఆ చిన్నారికి కేన్సర్ సోకిందని గుర్తించిన వైద్యులు రెండు వారాల కంటే ఎక్కువ రోజులు బతికే అవకాశం లేదని చెప్పారు. తాను చనిపోతానన్న విషయం తెలిసినప్పటికీ ఆ చిన్నారి ఆస్పత్రిలోని ఇతర రోగుల్లో ఆనందాన్ని నింపేందుకు ప్రయత్నించింది. పాటలు పాడుతు, డ్యాన్సులు చేస్తూ కేన్సర్ రోగుల్లో ఆనందాన్ని నింపే ప్రయత్నం చేయడంతో సుమారు ఆరు నెలల పాటు మిలిందా రోజ్ జీవించడం వైద్యులనే ఆశ్చర్యానికి గురి చేసింది. ఇందుకు ఆ చిన్నారి అందరితో ఆనందంగా గడపడమే కారణంగా వైద్యులు భావించారు. కేన్సర్ రోగుల్లో అటువంటి ఆనందాన్ని సంతోషాన్ని నింపడం ద్వారా మరింత కాలం వారు జీవించేలా చేయవచ్చన్న ఉద్దేశంతోనే రోజ్ డేను నిర్వహిస్తున్నారు.



**ప్రాణాలను తీస్తున్న భయం**

ఏపీలో ఏటా సుమారు 70 వేల నుంచి 75 వేల కేన్సర్ కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఏటా కేన్సర్‌తో చికిత్స పొందుతూ సుమారు 35 వేల నుంచి 40 వేల మంది మృతి చెందుతున్నారు. వీటిలో ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో లెక్కలను తీసుకుంటే సుమారు 18 వేల నుంచి 20 వేల కొత్త కేన్సర్ కేసులు నమోదవుతుండగా, ఏటా ఏడు వేల నుంచి తొమ్మిది వేల మంది మృతి చెందుతున్నారు. ఉత్తరాంధ్రలో నమోదవుతున్న కేన్సర్ కేసుల్లో దాదాపు 80 నుంచి 90 శాతం మంది రోగులు మూడు, నాలుగు స్టేజుల్లో ఆస్పత్రులకు వస్తున్నారు. దీనివల్ల ప్రాణాలను కాపాడడం సాధ్యం కావడం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముందుగా కేన్సర్ కేసులను గుర్తిస్తే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, కానీ చాలామందిలో భయం, ముందస్తు పరీక్షలు చేయించుకుంటే కేన్సర్ అని తేలుతుందేమోనన్న ఆందోళన పరిస్థితి చేయి దాటిపోయేలా చేస్తోందని వైద్యులు పేర్కొంటున్నారు. దీంతో కేన్సర్ బారినపడుతున్న రోగుల్లో భయంతోనే అత్యధికులు మృతి చెందుతున్నారు. కుటుంబ సభ్యులకు కేన్సర్ పట్ల అవగాహన లేకపోవడం, దీని బారినపడిన తరువాత పూర్తిగా మంచానికే పరిమితం కావడం వల్ల మరింత నిరాశ, నిస్పృహలకు లోనై ప్రాణాలు కోల్పోతున్నట్టు వైద్యులు తెలుపుతున్నారు.

**ముందుగా గుర్తిస్తే మేలు..**

కేన్సర్ లక్షణాలు లేకుండానే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటే ప్రాథమిక స్థాయిలోకి రాకుండానే కొన్ని లక్షణాలను గుర్తించేందుకు అవకాశం ఉంది. దీన్ని జీరో స్టేజ్‌గా చెబుతారు. ఈ స్టేజ్‌లో వ్యాధిని గుర్తిస్తే 99 శాతం మేర ప్రాణాలను కాపాడవచ్చు. లక్షణాలను వెంటనే గుర్తిస్తే దాన్ని మొదటి స్టేజ్‌గా చెబుతారు. ఈ స్టేజ్‌లో 95 నుంచి 98 శాతం మేర ప్రాణాలను కాపాడవచ్చు. రెండో స్టేజ్‌లో గుర్తిస్తే 70 శాతం, మూడో స్టేజ్‌లో గుర్తిస్తే 50 శాతం వరకు ప్రాణాలను రక్షించే అవకాశం ఉంది. నాలుగో స్టేజ్‌లో బాధితులు ఆస్పత్రులకు వస్తే మాత్రం పది శాతం కంటే తక్కువ మందికి మాత్రమే ఐదేళ్లపాటు జీవించే అవకాశం దక్కుతుందని వైద్యులు చెబుతున్నారు.

**ఈ కేసులు ఎక్కువ..**

ఉత్తరాంధ్రలో నమోదయ్యే ప్రతి వంద కేన్సర్ కేసుల్లో 30 వరకు నోటి కేన్సర్లు, 15 అన్న వాహిక, 10 లంగ్, 8 నుంచి 9 వరకు రొమ్ము, ఐదు నుంచి ఎనిమిది వరకు సర్వైకల్, మిగిలినవి చర్మ, మెదడు, ఎముకలు, రక్త కేన్సర్లు ఉంటున్నట్టు వైద్యులు పేర్కొంటున్నారు.

**ఆత్మస్థైర్యంతో వైద్యం చేయించుకోవాలి**

-డాక్టర్ వై.విజయ ఆదిత్య, అంకాలజీ వైద్య నిపుణులు, హెచ్‌సీజీ కేన్సర్ ఆస్పత్రి



వ్యాధి కంటే భయమే ప్రాణాలను తీస్తుంది. కేన్సర్ వ్యాధిలో దాని తీవ్రత కాస్త ఎక్కువగా ఉంటుందని చెప్పాలి. కేన్సర్ వ్యాధి బారినపడిన రోగుల్లో దాదాపు 90 శాతం మంది తమ జీవితం అయిపోయిందన్న భావనలో ఉంటున్నారు. కుటుంబ సభ్యులు కూడా అదే ఆలోచనలో ఉంటున్నారు. కానీ కేన్సర్‌తో చికిత్స పొందుతూ కూడా భయాన్ని విడనాడి సాధారణ జీవితాన్ని కొనసాగించవచ్చు. ధైర్యంగా చికిత్స పొందడం ద్వారా మెరుగైన జీవనాన్ని పొందేందుకు అవకాశం ఉంది. రోగుల భయమే ప్రాణాలను తీస్తోంది. కొన్ని వారాలకు మించి బతకదు అనుకున్న చిన్నారి మిలిందా రోజ్ అందరితో ఆనందంగా గడిపి ఆరు నెలలపాటు బతికి వైద్యులనే ఆశ్చర్యానికి గురి చేసింది. తనకు కేన్సర్ అన్న విషయాన్ని ఆ చిన్నారి మరిచిపోయి రోజువారీ జీవితాన్ని ఆనందంగా గడపడం వల్లే మరింత కాలం బతికేలా చేసింది. అదే అందరూ ఆత్మస్థైర్యంతో వైద్యం చేయించుకోవాలి. ముందస్తు పరీక్షలు చేయించుకునేందుకు భయపడకూడదు. వ్యాధి ఉంటేనే నిర్ధారణ అవుతుంది. ఈ విషయంలో అపోహలు విడనాడాలి. స్క్రీనింగ్ పరీక్షలకు మహిళలు, పురుషులు ముందుకు రావాలి.

## సుపరిపాలన 'కూటమి'కే సాధ్యం

▸ వంద రోజుల్లోనే నిరూపణ

▸ 'ఇది మంచి ప్రభుత్వం'లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు



కొత్తఎల్లవరంలో కరపత్రాలు పంచుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**గొలుగొండ, సెప్టెంబరు 21:** సుపరిపాలన అందించడం ద్వారా వంద రోజులలోనే 'ఇది మంచి ప్రభుత్వం' అనిపించుకున్న ప్రభుత్వం తమదని ఏపీ శాసనసభ స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. మండలంలోని కొత్తఎల్లవరం గ్రామపంచాయతీలో శనివారం ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుతుందని, అవసరాలను తీర్చుతుందని హామీ ఇచ్చారు. ల్యాండ్ టైటిలింగ్ రద్దు, పింఛన్ల పెంపు వంటి ప్రధాన హామీలు ఇప్పటికే నెరవేర్చామని.. మరి కొన్నింటిని త్వరలోనే అమలు చేయనున్నామని చెప్పారు. ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. కొత్తఎల్లవరం గ్రామానికి వందరోజుల్లో రూ.రెండు కోట్ల ఎనభై లక్షల రూపాయలు మంజూరు చేశామన్నారు.

కాలువలు, రోడ్లు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేశామన్నారు. కొత్తఎల్లవరం, కశిమి, జమ్మవరం రెవెన్యూలో ఎన్నో ఏళ్లుగా దీర్ఘకాలిక సమస్య ఈనాం భూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. పంచాయతీరాజ్ శాఖామంత్రిగా పవణ్‌కల్యాణ్ పంచాయతీల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీలు నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం, మండల ప్రత్యేకాధికారి మోహన్‌రావు, ఎంపీడీవో డేవిడ్‌రాజ్, డీఎల్‌డీవో ఉదయశ్రీ, టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర, స్థానిక సర్పంచ్ కొల్లి రాంబాబు, మండల నాయకులు చిటికెల సాంబమూర్తి, కొల్లి సత్తిబాబు, క. రవివర్మ, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

▸ 'స్వచ్ఛత హీ సేవ'లో కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ దీపిక



కలెక్టరేట్ ప్రాంగణంలో పరిసరాల పరిశుభ్రతలో పాల్గొన్న కలెక్టర్

**అనకాపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులు శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇక్కడి శంకరంలోని కలెక్టరేట్ పరిసరాల్లోని పిచ్చి మొక్కలు, గడ్డి, చెత్తాచెదారాన్ని కలెక్టర్ విజయకృష్ణన్ సిబ్బందితో కలిసి స్వయంగా పలుగు, పార పట్టుకొని తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నెలలో ఒక రోజు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టి అధికారులు, ఉద్యోగులు భాగస్వాములు కావాల్సిందిగా కోరారు. అలాగే, జిల్లా ఎస్పీ కార్యాలయంలో చేపట్టిన పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో ఎస్పీ ఎం.దీపిక పాల్గొని చెత్త తొలగింపు పనుల్లో సిబ్బందికి సహకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభం

**నక్కపల్లి, సెప్టెంబరు 21 :** ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ శనివారం మధ్యాహ్నం ప్రారంభమైంది. ఇసుక కావల్సిన లబ్ధిదారులు, వినియోగదారులు ఇసుక డిపో వద్దకు వచ్చి పడిగాపులు పడకుండా, నేరుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని ఇసుక పొందే అవకాశాన్ని కూటమి సర్కారు కల్పించింది. ఆన్‌లైన్‌లో బుకింగ్ అనంతరం ఈ డిపో పరిధిలో జీపీఎస్ చేసుకున్న ట్రాక్టర్లు, లారీల యజమానులకు సంబంధిత యాప్ ద్వారా ఇసుక తరలించాల్సిన వినియోగదారుల ఫోన్‌కు అనుసంధానం చేస్తూ మెసేజ్ పంపుతారు. వెంటనే డిపో నుంచి సంబంధిత ప్రాంతానికి ఇసుకను పంపిస్తారు. శనివారం లాంఛనంగా మైన్స్ అధికారుల పర్యవేక్షణలో ఇసుక ఆన్‌లైన్ బుకింగ్, రవాణా ప్రారంభించారు. ప్రస్తుతం జీఎస్‌టీతో కలిపి టన్ను ఇసుక రూ. 1165లుగా నిర్ణయించారు. ఒక యూనిట్ (ట్రాక్టర్)కు ఐదు టన్నుల ఇసుకను లోడింగ్ చేస్తారు. ప్రభుత్వం నిర్దేశించిన ఐదు టన్నుల అమౌంట్ ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. ఇదికాక రవాణా చేసినందుకు ట్రాక్టర్ నిర్వాహకులకు రూ.600 నుంచి రూ. 800 చెల్లించాల్సి ఉంటుంది. ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ వల్ల తమకు సమయం ఆదా అవుతుందని పలువురు వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు.

## బెంగళూరు-గౌహతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

▸ ఎస్-7 బోగీ చక్రాల నుంచి వ్యాపించిన మంటలు

▸ ప్రయాణికులు అప్రమత్తమై చైన్ లాగడంతో సింహాచలం రైల్వే స్టేషన్‌లో నిలిచిన రైలు

▸ తక్షణమే స్పందించి మంటలను అదుపుచేసిన భద్రతా సిబ్బంది



రైలుదిగి ట్రాక్‌పైకి వచ్చిన ప్రయాణికులు

**విశాఖపట్నం, సెప్టెంబరు 21:** బెంగళూరు నుంచి గౌహతి వెళుతున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు శనివారం రాత్రి ప్రమాదం తప్పింది. ఓ బోగీ కింద నుంచి మంటలు, పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు గమనించి చైన్ లాగారు. రైలు ఆగిన వెంటనే భయాందోళనతో ప్రయాణికులు హాహాకారాలతో పరుగులు తీశారు. సిబ్బంది వెంటనే అప్రమత్తమై మంటలను అదుపుచేశారు. వివరాలిలా ఉన్నాయి. బెంగళూరు నుంచి గౌహతి వెళుతున్న (రైలు నెంబరు 12509) రైలు విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి శనివారం రాత్రి 8.50 గంటలకు బయలుదేరింది. గోపాలపట్నం ఆర్ఆర్‌ఐ కేబిన్ వద్దకు చేరుకునే సరికి ఎస్-7 బోగీ చక్రాలకు బ్రేక్ షూలు పట్టేయడంతో తీవ్రమైన రాపిడి జరిగి కింద నుంచి మంటలు రావడంతో పాటు దట్టమైన పొగలు వ్యాపించాయి. బోగీ కింద నుంచి పొగలు రావడం గమనించిన కొందరు ప్రయాణికులు చైన్ లాగారు. దీంతో రైలును రాత్రి 9.05 గంటలకు సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఆపారు. రైలు ఆగిన వెంటనే ప్రయాణికులు హాహాకారాలు చేస్తూ కిందకు దూకి పరుగులు పెట్టారు. మరోవైపు సమీపంలో ఉన్న భద్రతా సిబ్బంది, స్టేషన్ అధికారులు, రైలులోని సిబ్బంది తక్షణమే స్పందించి అగ్నిమాపక యంత్రంతో మంటలు వ్యాపించకుండా అదుపుచేశారు. అనంతరం రైల్వే సిబ్బంది మరమ్మతులు చేపట్టి ఎటువంటి ఇబ్బంది లేదని నిర్ధారించడంతో రాత్రి 9.30 గంటలకు సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి రైలు బయలుదేరి వెళ్లింది. సింహాచలం స్టేషన్‌లో రైలు ఆగగానే ప్రయాణికులు కొందరు కిందకు దూకి పరుగులు తీశారు.

## ల్యాండ్ పూలింగ్‌లో అవకతవకలపై సమగ్ర విచారణ

▸ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ





మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

**కొత్తూరు, సెప్టెంబరు 21:** వైసీపీ ప్రభుత్వ హయాంలో ల్యాండ్ పూలింగ్‌లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపిస్తామని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లి మండలం సంపతిపురంలో శనివారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. అనకాపల్లి నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు, పేదల భూములను రక్షించడం కోసమే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశామని వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లో చేపట్టిన ప్రగతిని వివరించారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గర్భిణులకు సామూహిక సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఆర్డీవో చిన్నికృష్ణ, ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, గ్రామ సర్పంచ్ నంబారు నాగమణి, టీడీపీ సీనియర్ నాయకుడు నంబారు శ్రీను, ఎంపీటీసీ కడిమి గణేష్ పాల్గొన్నారు.

### మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మ దహనం



జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కూటమి నాయకులు

**కొయ్యూరు, సెప్టెంబరు 21:** హిందువుల మనోభావాలు దెబ్బతినేలా తిరుమల తిరుపతి దేవస్థాన లడ్డూలో కల్తీకి పాల్పడ్డారంటూ మాజీ సీఎం జగన్మోహనరెడ్డి దిష్టిబొమ్మను కూటమి నాయకులు శనివారం దహనం చేశారు. స్వచ్ఛమైన ఆవు నెయ్యితో తయారు చేయాల్సిన తిరుమల ప్రసాదంలో కల్తీకి పాల్పడినట్టు నిర్ధారణ కావడంతో జగన్‌తో పాటు టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు దొరబాబు, బీజేపీ మండల నేత చక్రధరరావు, కూటమి నాయకులు మేడిబోయిన సత్తిబాబు, మాకాడ బూర్జలయ్య, నాగేశ్వరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### నేషనల్ బాక్సింగ్ పోటీలో మౌనికకు స్వర్ణ పతకం





**నర్సీపట్నం, సెప్టెంబరు 21:** గౌహతిలో జరిగిన జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలలో నర్సీపట్నంకు చెందిన బొంతు మౌనిక 80 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించింది. గౌహతిలో ఈనెల 14 నుంచి 21 వరకు జరిగిన బాక్సింగ్ పోటీలు జరిగాయి. శుక్రవారం మణిపూర్ బాక్సర్‌ని ఓడించిన మౌనిక ఫైనల్స్‌కు చేరింది. శనివారం పంజాబ్ బాక్సర్‌తో తలబడి తొలి రౌండ్‌లోనే రెండు సార్లు కౌంట్ ఇచ్చి అత్యధిక స్కోర్‌తో బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా మౌనికకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బి.లక్ష్మణ్‌దేవ్ అభినందనలు తెలిపారు.

## ప్రజా పోరాటాలతోనే గిరిజన ప్రాంతం అభివృద్ధి

▸▸ సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

**పాడేరు రూరల్, సెప్టెంబరు 21:** ప్రజా పోరాటాలతోనే గిరిజన ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన జోనల్ వర్క్‌షాప్ అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ శాఖ మండల, జిల్లా మహాసభల షెడ్యూల్‌ను ప్రకటించారు. అక్టోబరు 25 నాటికి మండల మహాసభలు పూర్తి చేసుకుని డిసెంబరు 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పాడేరులో జిల్లా మహాసభలను నిర్వహిస్తామన్నారు పాడేరు, అరకు నియోజకవర్గాల్లో ప్రజలు వైసీపీ నేతలను ఎమ్మెల్యేలుగా, ఎంపీగా ఎన్నుకుంటే శాసన సభ సమావేశాలను వారు బహిష్కరిస్తున్నారన్నారు. దీంతో ఆదివాసీ తెగల సమస్యలపై ప్రాతినిధ్యం లే కుండా పోతోందన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కూటమి ప్రభుత్వ పా లన మిశ్రమంగా ఉందని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఆదివాసీ తెగలకు ఇచ్చిన జీవో 3 రిజర్వేషన్ పునరుద్ధరణపై ముఖ్యమంత్రి మౌనం పాటించడం తగదన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు ఎల్.సుందరరావు, ఎస్.హైమావతి, డి.బొజ్జన్న పాల్గొన్నారు.

## తియ్యగెడ్డలో ప్రత్యేక వైద్య శిబిరం

**పాడేరు రూరల్, సెప్టెంబరు 21:** మినుములూరు పీహెచ్‌సీ పరిధిలోని తియ్యగెడ్డ గ్రామంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు చేపట్టామని ఆరోగ్య విస్తరణాధికారి గుల్లేల సింహాద్రి తెలిపారు. గ్రామంలో ప్రతీ ఇంటికి ఐఎస్ఎస్ స్ప్రేయింగ్, ఫోకల్ స్ప్రేయింగ్, ఏంటీలార్వా ఆపరేషన్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ శిబిరంలో అనుమానితులుగా ఉన్న 28 మందికి రక్త నమూనాలను సేకరించామన్నారు. జ్వర లక్షణాలు గల ఐదుగురికి ఆర్‌డీటీ నిర్వహించి సాధారణ జ్వరాలుగా గుర్తించి మందులు అందించామన్నారు. ఈ శిబిరంలో సబ్ యూనిట్ అధికారి బి.ధనుంజయ్, ఎంటీఎస్ కె.ప్రసాద్, వైద్య సిబ్బంది కేవీవీఆర్‌కే.మూర్తి, కె.భీమన్నదొర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాత్కాలి వంతెన నిర్మాణం

**గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 21:** మండలంలోని అధిక వర్షాలకు కొట్టుకుపోయిన చామగెడ్డ వాగు వద్ద తాత్కాలిక వంతన నిర్మాణ పనులు ప్రారంభించామని పంచాయతీరాజ్ ఏఈఈ జ్యోతిబాబు తెలిపారు. శనివారం చామగెడ్డ వాగు వద్ద తాత్కాలిక వంతెన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఈఈ మాట్లాడుతూ వర్షాలకు వంతెన కొట్టుకుపోవడం వల్ల సుమారు 16 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తాత్కాలిక వంతెన నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఆదివారం సాయంత్రానికి ఈ మార్గంలో వాహన రాకపోకలను పునరుద్ధరిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## 24న మండల సర్వసభ్య సమావేశం

**పాడేరు రూరల్, సెప్టెంబరు 21:** మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 24న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీవో కె.సాయినవీన్ తెలిపారు. ఎంపీపీ సొనాయి రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

## చట్రాపల్లి వదర బాధితులకు పీఆర్‌టీయూ ఆర్థిక సాయం



క్షతగాత్రుడికి నగదు అందిస్తున్న పీఆర్‌టీయూ నేతలు

**గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 21:** వరదలు, కొండచరియలు వల్ల గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గిరిజనులకు పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం చింతపల్లి, జీకే వీధి మండలాలకు చెందిన పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు కేజీహెచ్‌కు వెళ్లి బాధితులను పరామర్శించారు. బాధితుల ఆరోగ్య ఖర్చుల కోసం ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా సేకరించుకున్న రూ.27,700 నగదును అందజేశారు. అలాగే కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జీకేవీధి ఎంపీయూపీ పాఠశాల విద్యార్థి కుర్ర అభి, కొయ్యూరు మండలం వైఎస్‌పాకలు ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మాదాల కల్యాణి పరామర్శించిన నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.లక్ష్మణరావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి, స్టేట్ కౌన్సెలర్ దామోదరరావు, జీకే వీధి గౌరవ అధ్యక్షుడు జీవీ రమణ, ప్రధాన కార్యదర్శి కిల్లో వసంత్‌కుమార్, నాయకుడు శరభకుమార్ పాల్గొన్నారు.

## మొరాయించిన సర్వర్.. నమోదుకాని ఈకేవైసీ

**సీలేరు, సెప్టెంబరు 21:** జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టం పై ఈకేవైసీ నమోదుకు వచ్చిన గిరిజన రైతులకు నిరాశ ఎదురైంది. శనివారం పంచాయతీ పరిధిలోని మాదిమళ్ళు, చోడిరాయి, కొల్తూరుకోట గ్రామాల రైతులు కాలినడకన అతి కష్టం మీద గుమ్మిరేవుల పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. అయితే అక్కడ ఈకేవైసీ సర్వర్ పని చేయలేదు. దీంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెనుదిరిగారు.

## మావోయిస్టుల వారోత్సవాలతో పోలీసులు అప్రమత్తం



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**చింతపల్లి, సెప్టెంబరు 21:** మావోయిస్టు ఆవిర్భావ వారోత్సవాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఓ వైపు అడవుల్లో గాలింపు చర్యలు నిర్వహిస్తూనే ప్రధాన కేంద్రాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. శనివారం స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రమేశ్, ఎస్ఐ అరుణ్ కిరణ్ పర్యవేక్షణలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా ఏవోబీ ముఖ ద్వారమైన చింతపల్లి హనుమాన్ జంక్షన్, డిగ్రీ కళాశాల, లోతుగెడ్డ బ్రిడ్జి, లంబసింగిలో 24 గంటలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి విడిచి పెడుతున్నారు. బాంబ్ స్క్వాడ్ బృందాలు ప్రధాన రహదారులు, కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. వీఐపీల పర్యటనలకు అదనపు బందోబస్తు కల్పిస్తున్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

▸▸ టీడీపీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు కిడారి శ్రావణ్‌కుమార్

▸▸ మన్యంలో ఉత్సాహంగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాలు



హుకుంపేట సభలో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్...



కొయ్యూరులో కరపత్రాలు పంచుతున్న కూటమి నేతలు

**హుకుంపేట/కొయ్యూరు/చింతపల్లి/అనంతగిరి/డుంబ్రిగుడ, సెప్టెంబరు 21:** గిరిజన ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కిడారి శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మన్యంలోని పలు మండలాల్లో కూటమి నాయకులు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వంద రోజుల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అలాగే కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న మంచి కార్యక్రమాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. హుకుంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రావణ్ మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం పేరుతో వచ్చే రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, నాయకులు సాగిరి సుబ్బారావు, లక్ష్మణుడు, తులసీరావు, కంబిడి రాంబాబు పాండు, జ్ఞానప్రకాష్, బి.రమణ, సుమన్, సత్యనారాయణ, సాగరి సత్యవతి, సూర్యకాంతం, సత్యనారాయణ, శంకర్, మురళీ, రాంబాబు, వాసుదేవ్ పాల్గొన్నారు. కొయ్యూరులో టీడీపీ మండల కార్యదర్శి తోట దొరబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నదన్నారు. ఏవో ఉమాదేవి, బీజేపీ నేత ఎం.చిన్న, సర్పంచ్ ఎం.బాలరాజు, ఉప సర్పంచ్ విఘ్నేశ్వరి, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. చింతపల్లిలో టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలు నెరవేర్చుతున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, టీడీపీ నాయులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, లక్కోజు నాగ భూషణం, జనసేన మండలాధ్యక్షుడు బుజ్జిబాబు పాల్గొన్నారు. అనంతగిరిలో ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బూర్జ లక్ష్మి మాట్లాడుతూ వంద రోజుల పాలనలో ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. సర్పంచ్ రూతు, నాయకులు ఎం.రంజిత్, మట్టం శ్యామ్, పి.భీమన్న, బాలకృష్ణ పాల్గొన్నారు. డుంబ్రిగుడలో టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కితలంగి పంచాయతీలో జనసేన మండల అధ్యక్షుడు దనేశ్వరరావు నాగేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్ ఇది అందరి ప్రభుత్వం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, గంగాధర్, గెన్ను పాల్గొన్నారు.

# యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం

▸▸ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్



యోగాసనాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

**పాడేరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** యోగాసనాలు సంపూర్ణ ఆరోగ్యానికి దోహద పడతాయని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో) వి.అభిషేక్ చెప్పారు. స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల మైదానంలో హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల మండలాలకు చెందిన వ్యాయామ సంచాలకులు, వ్యాయామ ఉపాధ్యాయులకు నిర్వహించిన యోగాసనాల శిక్షణ ముగింపు సందర్భంగా శనివారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పీవో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యోగా సాధనతో మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటామని చెప్పారు. చింతపల్లిలో జీకే వీధి, కొయ్యూరు మండలాల వారికి, అరకులోయలో అనంతగిరి, డుంబ్రిగుడ పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల ఉపాధ్యాయులకు యోగా శిక్షణ అందిస్తామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు నేర్చుకున్న యోగాసనాలను ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నేర్పించాలని ఆయన సూచించారు. అలాగే యోగా, ప్రాణయామం, జ్ఞాన ముద్ర, సూర్యముద్రా ఆసనాలు ఆచరిస్తే ఆరోగ్యంగా ఉంటామన్నారు. అలాగే సివిల్స్ ప్రిపరేషన్‌లో ఉన్నప్పుడు యోగా చేసేవాడినని, యోగాసనాలు ఆచరించడం వద్ద ఒత్తిడి తగ్గుతుందన్నారు. ప్రాణయామాన్ని విద్యార్థులకు నేర్పించాల, పాఠశాలలు సందర్శించినపుడు యోగాసనాలను పరిశీలిస్తానన్నారు. యోగా గురు, ప్రణవ సంకల్ప యోగా సమితి వ్యవస్థాపకుడు, పతంజలి శ్రీనివాస్ ముందుగా వ్యాయామ ఉపాధ్యాయులతో సూర్య నమస్కారాలు, పశ్చిమోత్తాసనం, సర్వాంగాసనం, హలాసనం, చక్రాసనాలను చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగాసనాల అభ్యసనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. నీటి ధర్మం, ఆహార ధర్మాలు, యోగాసనాలు విద్యార్థులకు నేర్పించాలన్నారు. ఆసనాలు నేర్చుకున్న విద్యార్థులు చాలా ఉత్సాహంగా ఉంటారన్నారు. ఏటీడబ్ల్యూవో ఎల్.రజని మాట్లాడుతూ పీవో ఆదేశాలతో యోగా శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. ఆశ్రమ పాఠశాలలో ఉదయం 5 గంటలకే వ్యాయామ కార్యక్రమాలు ప్రారంభిస్తారన్నారు. యోగా ద్వారా విద్యార్థులకు మంచి నడవడిక, క్రమశిక్షణ అలవాటు అవుతుందన్నారు. ఈకార్యక్రమంలో తలారిసింగి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం రామారావు, వ్యాయామ సంచాలకులు సింహాచలం, రాజబాబు, పీఈటీలు పాల్గొన్నారు.




శిక్షణ, సందర్శన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఆర్ ఆళ్ల అప్పలస్వామి

## వేరుశనగ సాగుకు ప్రణాళిక: ఏడీఆర్ అప్పలస్వామి

**చింతపల్లి, సెప్టెంబరు 21:** గిరిజన ప్రాంతంలో రబీ పంటగా శనగ సాగుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ ఆళ్ల అప్పలస్వామి చెప్పారు. పరిశోధన స్థానంలో శనివారం నెలవారీ జిల్లా స్థాయి శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగ పంటను రైతులతో సాగు చేయించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ పంటకు నీరు పెద్దగా అవసరంలేదని, కేవలం మంచుతోనే పండుతుందని చెప్పారు. అలాగే ఉలవల పంటను కూడా సాగుచేపట్టేందుకు రైతులను ప్రోత్సహించనున్నామన్నారు. పాడేరు డీఏవో ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఎంటీయూ 1121, ఆర్ఎన్ఆర్ 15048 వరి రకాల్లో అగ్గి తెగులు అధికంగా ఉన్నదని, బ్యాక్టీరియా వల్ల ఎండు ఆకు తెగులు వ్యాప్తి చెందిందని చెప్పారు. దీనికి శాస్త్రవేత్తలు నివారణ చర్యలను వివరించారు. చింతపల్లి ఏడీఏ కంటా జాహ్నవి మాట్లాడుతూ వర్షాల అనంతరం పంటల స్థితిగతులు, సరళి, వర్షపాతం వివరాలను వివరించారు. ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ మిరియాలు, కాఫీ, పసుపు, అల్లం పంటల్లో కలిగే తెగుళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ పశు వైద్యాధికారి డాక్టర్ దేశగిరి దమయంతి, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ బయ్యపురెడ్డి, బాల హుస్సైన్ రెడ్డి, డాక్టర్ ఉజ్వలరాణి, వ్యవసాయ అధికారులు శ్రీనివాసరావు, మధుసూదనరావు, విజయలక్ష్మి, పద్మశోభ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిని నియమించాలని ఆందోళన



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు..

**అనంతగిరి, సెప్టెంబరు 21:** మండలంలోని జీనబాడు పంచాయతీ సరియా గ్రామంలోని జీపీఎస్ పాఠశాలలోని ఉపాధ్యాయుడిని నియమించాలని కోరుతూ శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఏడాదిన్నరగా ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు చ దువుకు దూరమవుతున్నారన్నారు. అయితే, ఈ గ్రామ పాఠశాలలో గతనెల ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని విద్యార్థుల తల్లిదండ్రులే ఘనంగా నిర్వహించారు. దీనిపై 'టీచర్ లేని బడిలో జెండా పండగ' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి.. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఆగస్టు 17 నుంచి ఉపాధ్యాయురాలు వసంతకుమారి నియమించారు. నెల రోజుల పాటుగా బోధించిన ఆమె ప్రస్తుతం రావటం లేదని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయి ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వంతెన మరమ్మతు పనుల పరిశీలన



లంకపాకల రక్షణ గోడల పనులు పరిశీలిస్తున్న ఈఈ

**సీలేరు, సెప్టెంబరు 21:** సీలేరు-జీకే వీధి రహదారిలో వంతెనల మరమ్మతు పనులను ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లంకపాకలు-సంపంగిగొంది మధ్య రెండు వంతెనలు నీటి ప్రవాహానికి కోతకు గురయ్యాయని చెప్పారు. వీటిపై భారీ వాహనాలు వెళ్తే కూలిపోయి ప్రమాదం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో వంతెనల కింద భాగంలో ఐరన్ సపోర్టులను ఏర్పాటు చేసి కాంక్రీట్ వేయడంతో పరిస్థితి మెరుగుపడుతుంన్నారు. ఈ పనులను పూర్తి కాగానే సీలేరు-జీకే వీధి మార్గంలో బస్సులు నడవడానికి అనుమతులు ఇస్తామన్నారు. అలాగే లంకపాకల నుంచి ఘాట్ రోడ్డులో దెబ్బతిన్న రక్షణ గోడలు, రోడ్డు వద్ద ఇసుక మూటలను పేర్చి వాహనాలు ప్రమాదాలు జరగకుండా ఉండేలా పనులను వేగవంతం చేశామన్నారు. ఈ పనులు పూర్తి కాగానే ఈ రూట్లో బస్సులు తిరిగేందుకు అనుమతిస్తొన్నారు.

## జీవో-85కు వ్యతిరేకంగా పీహెచ్‌సీ వైద్యుల నిరసన

**పాడేరు రూరల్, సెప్టెంబరు 21:** వైద్య విద్యార్థుల పీజీ ప్రవేశాల సర్వీస్ కోటా కుదిస్తూ జారీ చేసిన జీవో 85 రద్దు చేయాలని పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్. ప్రతాప్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో శనివారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటీడీఏ కార్యాలయం వద్ద నల్ల రిబ్బన్లు ధరించి వైద్యులు నిరసన తెలిపారు. అనంతరం ప్రతాప్ మాట్లాడుతూ.. ప్రభుత్వంతో ఇటీవల నిర్వహించిన విఫలం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వై ద్యులు సమ్మె చేపట్టక తప్పడంలేదన్నారు. జీవో 85 రద్దు చేసి పాత పద్ధతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంతి పవన్ కళ్యాణ్‌కు వినతులందించామన్నారు. ఈ నేపథ్యంలో తిరిగి చర్చలకు 23వ తేదీ సోమవారం విజయవాడ వెళ్లనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సంఘం నాయకులు సందీప్, జ్ఞానేశ్వరి, హిమబిందు, లక్ష్మాకాంత్, కిరణ్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.




ఐటీడీఏ వద్ద జీవో 85కి వ్యతిరేకంగా నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న వైద్యులు

## ముందస్తు రబీ పంటగా వలిసెలు

... 5వ పేజీ తరువాయి

ఎకరాకు అవసరమైన 4 కిలోల విత్తనం 20 లీటర్ల నీటిలో 3 కిలోల ఉప్పు కలిపి ఆ ద్రావణంలో వేసి బాగా కలియబెట్టాలి. ఈవిధంగా చేయడం వల్ల ఆకాశ పందిరి విత్తనాలు అడుగుకు, వలిసెల విత్తనాలు నీటి పైభాగానికి వస్తాయి. ఈవిధంగా ఆకాశ పంది కలుపు విత్తనాలను తొలగించుకోవాలి.

**పోషక యాజమాన్యం**

వలిసెలు విత్తే సమయంలో ఎకరానికి 4టన్నుల చొప్పున పశువుల ఎరువు గాని, కంపోస్టు ఎరువు గాని వేసుకోవాలి. దీనివల్ల పంట ఎదుగుదలకు పోషకాలు, నీరు భూమిలో నిలుపుదల చేసుకోవడానికి ఉపయోగకపడుతుంది. వలిసెల పంట ఎకరాకు 8కేజీల నత్రజని, 8కేజీల భాస్వరం, 4కేజీల పొటాష్, 4-6కేజీల గంధకాన్ని వచ్చే ఎరువులను వేసుకోవాలి. నత్రజని రెండు దఫాలుగా విత్తేటప్పుడు, మొగ్గదశలో వేసుకోవాలి.

## ప్రజల ఆకాంక్షల మేరకే కూటమి పాలన

... 5వ పేజీ తరువాయి

సహాయక, పునరావాస చర్యలే ఈ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు వంటి విజనరీ నేత మనకు సీఎం కావడం ఎంతో అదృష్టమన్నారు. ఎటువంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా ప్రజలకు ఆయన చక్కని పాలన అందించగలరన్నారు. అనంతరం వంతల గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అందుకు ముందు ఆయన పాడేరులో మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్యాణి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు బొర్రా నాగరాజు, కేవీ.రమేశ్‌నాయుడు, కె.సుబ్బారావు, మాజీ మంత్రి మణికుమారి, నేతలు పి.గోవిందరావు, డప్పోడి వెంకటరమణ, బొర్రా విజయరాణి, గంగపూజారి శివకుమార్, డీపీ.సురేశ్‌కుమార్, బుద్ద జ్యోతికిరణ్, వంజరి చిరంజీవినాయుడు, కేవీ.సురేశ్‌కుమార్, గబ్బాడ కుమారి, జనసేత నేతలు కిట్లంగి పద్మ, బి.దివ్యలత, తదితరులు పాల్గొన్నారు.

## స్వీట్స్‌లోనూ కల్తీ నెయ్యే?

... 5వ పేజీ తరువాయి

చాలా స్వీటు షాపుల్లో కల్తీ నెయ్యినే వాడుతున్నారు.

**నెయ్యిలో ఏమి కలుపుతారంటే..?**

నెయ్యిని తక్కువ ధరకు అమ్మడానికి అందులో డాల్డా, పామాయిల్, జంతువుల కొవ్వు కలుపుతారు. కొన్నిసార్లు రిఫైన్డ్ నూనెలు, రసాయనాలు, కలర్ కోసం రంగులు, నిల్వ చేయడానికి అవసరమైన ప్రిజర్వేటివ్‌లు కలుపుతారు.

**ఎలా గుర్తించాలంటే...**

కల్తీ నెయ్యి రంగు వేరుగా ఉంటుంది. చూడగానే తెలిసిపోతుంది. దీనికి రుచి, వాసన ఉండవు. సీసాలో పైన ఆయిల్ తేలుతూ కిందన పదార్థంలా పేరుకుపోతుంది. వేడి చేస్తే పూర్తిగా కరగదు. కొంత అలాగే ఉండిపోతుంది.

**కల్తీ నెయ్యితో నష్టాలు**

● అజీర్ణ సమస్యలు ● అలర్జీ ● రంగు కలపడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

**ప్రాంతీయ లేబొరేటరీకి ఎన్ఏబీఎల్ గుర్తింపు లేదు**

**-జీవీ అప్పారావు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, డివిజన్-3**

విశాఖ చినవాల్తేరులోని ప్రభుత్వ ప్రాంతీయ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీకి ఎన్ఏబీఎల్ గుర్తింపు లేదు. గుర్తింపు ఉన్న లేబొరేటరీలోనే ఆహార పదార్థాల కల్తీ జరిగిందా? లేదా? అనేది పరీక్షించుకోవాలి. చినవాల్తేరు లేబొరేటరీకి కేవలం నీటిని పరీక్షించే యంత్రాలే ఉన్నాయి. ఆహార పదార్థాలకు వారు ఇచ్చే సర్టిఫికెట్లు చెల్లవు. సింహాచలం దేవస్థానం ఎటువంటి సర్టిఫికెట్లు తీసుకున్నా పరిగణనలోకి రావు.

### సంక్షిప్తంగా..

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పాడేరు రూరల్, సెప్టెంబరు 21:** జిల్లా కేంద్రం పాడేరులో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. మెయిన్ రోడ్డులోని కాఫీ హౌస్ సమీపంలో నిర్వహణ పనుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. మెయిన్ బజారులో ఉన్న స్టేట్ బ్యాంకు పరిసర ప్రాంతాలతో పాటు ఐటీడీఏ న్యూ క్వార్టర్స్, నీలకంఠానగర్, జిల్లా పాత ఆస్పత్రి ప్రాంతాల ప్రజలు ఈ సమస్యను గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

## గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



శ్యామ్ (ఫైల్)

**పాడేరు రూరల్, సెప్టెంబరు 21:** జిల్లా కేంద్రం పాడేరు పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కంట శ్యామ్ గుండెపోటుతో శనివారం మృతి చెందారు. విధి నిర్వహణ సమయంలో అకస్మికంగా గుండెపోటు రావడంతో సహచర ఉద్యోగులు శ్యామ్‌ను హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన తుది శ్వాస విడిచినట్టు వైద్యులు ధ్రువీకరించారు. జిల్లాలోని అరకు గ్రామానికి చెందిన శ్యామ్ రెండేళ్లుగా పాడేరు పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. శ్యామ్ అకస్మిక మృతికి సహచర ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

## క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

**చింతపల్లి, సెప్టెంబరు 21:** స్థానిక గురుకుల జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ కె.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులతో ప్రజలు కేన్సర్ బారిన పడుతున్నారన్నారు. సహజసిద్ధంగా లభించే ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి మంచిందన్నారు. అరటి, బొప్పాయి, మామిడి పండ్లు ముగ్గబెట్టడానికి పిచికారీ చేసే రసాయనాలు శరీరంలోకి వెళ్లడం వల్ల క్యాన్సర్‌కు దారి తీస్తుందన్నారు. జంక్‌ఫుడ్స్, ప్లాస్టిక్‌లో వేడి ఆహారం తీసుకోవడం కూడా ప్రమాదకరమన్నారు. అనంతరం తెలుగు భాష ప్రాముఖ్యతపై తెలుగు భాష పరిరక్షణ సమితి సభ్యుడు తమ్మిరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు పారయ్య, రామేశ్వరం, తెలుగు భాష పరిరక్షణ సమితి సభ్యులు మాధవి సనార, అప్పలరాజు పాల్గొన్నారు.

## 24 నుంచి 'పొలం పిలుస్తోంది'...

**పెదబయలు, సెప్టెంబరు 21:** మండలంలో ఈ నెల 24వ తేదీ నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ తెలిపారు. సీతగుంట, సీకరి తదితర గ్రామాల్లో మంగళవారం ఉదయం 8.30 కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. అలాగే బుధవారం పెదకోడపల్లి, గంపరాయి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. పంటల పరిశీలన అనంతరం రైతులతో గ్రామసభలు నిర్వహించి వ్యవసాయం, దాని అనుబంధ శాఖల ద్వారా అమలయ్యే కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు.

## రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**డుంబ్రిగుడ, సెప్టెంబరు 21:** మండలంలోని సోవ్వా పంచాయతీ మాలివలస గ్రామంలో వీధి రోడ్ల నిర్మాణానికి ఎంపీపీ ఈశ్వరి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో వీధి రోడ్లు లేక వర్షాలతో వీధులు చిత్తడిగా మారాల్సిన దుస్థితి దాపురిస్తున్నదన్నారు. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సొవ్వా పంచాయతీ పరిధిలోని పది గ్రామాల్లో రూ.1.2 కోట్ల నిధులతో వీధి రోడ్లు నిర్మాణాలకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కిషన్ మోర్చా జిల్లా అధ్యక్షులు, పంచాయతీ సర్పంచ్ సోయిత, నాయకులు సింహాచలం, కమలాకర్ పాల్గొన్నారు.

## జీకే వీధిలో భారీ వర్షం



మండల కేంద్రంలో హోరున కురుస్తున్న వాన

**గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 21:** మండలంలో భారీ వర్షం కురిసింది. శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కుండపోత వాన పడింది. దీంతో ప్రధాన రహదారులు వాగులను తలపించాయి. పంట పొలాలు, లోతట్టు ప్రాంతాలకు వర్షపు నీరు చేరుకున్నది. సప్పర్ల వారపు సంతలో వర్తకులు, వినియోగదారులు వర్షం వల్ల ఇబ్బందులు పడ్డారు.

## డీ పట్టా భూముల పరిశీలన

**చింతపల్లి, సెప్టెంబరు 21:** గత ఏడాది పంపిణీ చేసిన డీ పట్టా భూములను తహసీల్దార్ టి.రామకృష్ణ శనివారం పునఃపరిశీలించారు. మండల కేంద్రంలోని బాలాజీపేటలో గిరిజనులకు పంపిణీ చేసిన భూములతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గత ఏడాది నవంబరులో 56 మంది గిరిజనులకు 97 ఎకరాల భూములను పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ భూములు పొందిన లబ్ధిదారులు అర్హులా? కాదా? భూములు అన్యక్రాంతం జరిగాయా? అనే అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. అలాగే సాయంత్రం బాలుర ఆశ్రమ పాఠశాల-2ను సందర్శించి మెనూను పరిశీలించారు. ఆశ్రమాల్లో కచ్చితంగా మెనూ అమలు చేయాలని తహసీల్దార్ ఆదేశించారు.

## 23న సామాజిక తనిఖీల ప్రజావేదిక

**పాడేరు రూరల్, సెప్టెంబరు 21:** గ్రామీణ ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను సోమవారం నిర్వహిస్తామని ఎంపీడీవో కె.సాయినవీన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని 26 పంచాయతీలలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, హౌసింగ్ గిరిజన సంక్షేమ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, సర్వశిక్షాభియాన్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై ఈ నెల 2 నుంచి సామాజిక బృందాలు తనిఖీలను పూర్తిచేసిన పంచాయతీల్లో సభలను నిర్వహించారన్నారు. పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనులపై నివేదిక అందించేందుకు ప్రజావేదికను నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు.